TGTEL/26/A4015

# తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 30, బుధవారం, సెప్టెంబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 144 తెలుగువారి పత్రిక..... మీ కోసం

రిపోర్టర్లు కావలెను

తెలంగాణ మంజీరా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న

తెలంగాణ మంజీరా

మీకు సరైన వేదిక... అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.

98496 38320

## నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా..

### కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్

- కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం
- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు
- కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత
- ఫాంహౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు
- గైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు.నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు.

## బీఆర్ఎస్ మ2 లోళా ఎమ్మెల్యేలపై దాడి వివాదం..

### హైకోర్టు కీలక ఆదేశాలు

-బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు అసభ్యంగా ప్రవర్తించారనడానికి ఆధారాల్లేవన్న హైకోర్టు

-బాధ్యులైన పోలీసులను గుర్తించాలని డీజీపీకి ఆదేశం

-పోలీసులపై చర్యలకు నివేదిక సిద్ధం చేయాలని సూచన

-నివేదికను స్పీకర్ ముందు ఉంచాలని ఆదేశం

-స్పీకర్ ఆదేశాలైతే చర్యలు ఆయన పరిధిలోనే ఉంటాయన్న కోర్టు

## బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్

తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు.చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గ టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు.దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంట రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న .

### యుద్ధం వస్తే క్షిపణుల కొరత రాకుండా..

## భారత్ కీలక నిర్ణయం!

-క్షిపణుల తయారీలోకి ప్రైవేట్ కంపెనీలు

-ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు

-యుద్ధ సమయంలో ఉత్పత్తికి ప్రత్యామ్నాయం

-డీఆర్‌డీవో టెక్నాలజీ బదిలీకి అనుమతి

-సరఫరా సమయం మెరుగుపడొచ్చని నివేదిక

2 లో

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపురాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

### ఉగ్రవాదంపై భారత్ రెడ్‌లైన్ గీసుకుంది..

### అమెరికాకు జైశంకర్

## ఇన్‌డైరెక్ట్ వార్నింగ్..!

భారత్-అమెరికా సంబంధాలపై కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం పై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని స్పష్టంచేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన గీసుకుందని, ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని వ్యాఖ్యానించారు. భారత్‌లో ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్ పట్ల అమెరికా సానూకూల ధోరణి కనబరుస్తున్న నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

2 లో

### స్టాక్ మార్కెట్‌కు వరుసగా

## రెండో రోజు నష్టాలు..

### సెన్సెక్స్ 242 పాయింట్లు డౌన్

### అధికారంలో లేకున్నా

## తగ్గని జోరు

### బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు

2 లో

-ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు పెరిగిన విరాళాలు

-2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.16.4 కోట్లుగా నమోదు

-గత ఏడాదితో పోలిస్తే పెరిగిన పార్టీ ఫండ్స్

-ఈసీకి సమర్పించిన నివేదికలో వెల్లడించిన బీఆర్ఎస్

-రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారిన పరిణామం

## స్టాక్ మార్కెట్‌కు వరుసగా రెండో రోజు నష్టాలు.. సెన్సెక్స్ 242 పాయింట్లు డౌన్

-64 పాయింట్లు తగ్గిన నిఫ్టీ

-వరుసగా రెండో సెషన్‌లో మార్కెట్‌కు నష్టాలు

-మార్కెట్ సెంటిమెంట్‌పై చమురు ధరల ప్రభావం

-మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లలో అమ్మకాలు

-ఫార్మా షేర్లతో మార్కెట్‌కు కొంత ఊరట

భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. పెరిగిన ముడి చమురు ధరలు, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్‌లో కొనసాగుతున్న ఒడుదొడుకులు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. దీంతో పలు రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది.

సెన్సెక్స్ 242.65 పాయింట్లు నష్టపోయి 72,529.07 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 64.05 పాయింట్లు తగ్గి 22,716.20 వద్ద ముగిసింది. నిఫ్టీలో టైటన్ కంపెనీ అత్యధికంగా నష్టపోయిన షేర్‌గా నిలిచింది. ఐటీ షేర్లలో విప్రో, హెచ్‌సీఎల్‌టెక్ కూడా ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ అమ్మకాలు కొనసాగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.99 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.81 శాతం పడిపోయాయి. కన్జ్యూమర్ డ్యూరబుల్స్, కెమికల్స్, రియల్టీ, ఐటీ రంగాలు ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు ఫార్మా షేర్లు మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చాయి.నిఫ్టీకి 22,750-22,800 స్థాయి తక్షణ నిరోధంగా ఉందని నిపుణులు తెలిపారు. 22,550-22,600 స్థాయి కీలక మద్దతుగా ఉందని పేర్కొన్నారు. 22,500 కంటే దిగువకు పడిపోతే అమ్మకాల ఒత్తిడి మరింత పెరిగి 22,300-22,000 ప్రాంతం వరకు సూచీ వెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు తెలిపారు. ఇదిలా ఉండగా, రూపాయి 95.97 వద్ద దాదాపు స్థిరంగా ట్రేడైంది.

## ఉగ్రవాదంపై భారత్ రెడ్‌లైన్ గీసుకుంది.. అమెరికాకు జైశంకర్ ఇన్‌డైరెక్ట్ వార్నింగ్..!

ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నతస్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోందంటూ పాకిస్తాన్ పేరును ప్రస్తావించకుండానే జైశంకర్ దుయ్యబట్టారు. అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుందని అన్నారు. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.భారత్-అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతోపాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ చెప్పారు. భారత్-అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పొరుగు దేశం నుంచే మద్దతు అందుతోందని నిరూపించేందుకు భారత్ పదేపదే తగిన ఆధారాలను సమర్పించిందని ఆయన గుర్తుచేశారు.

## అధికారంలో లేకున్నా తగ్గని జోరు..
### బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు

తెలంగాణలో అధికారం కోల్పోయి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అధికారంలో లేనప్పటికీ పార్టీకి విరాళాలు తగ్గకపోగా, గతేడాది కంటే పెరగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ పార్టీకి రూ. 16.4 కోట్ల విరాళాలు అందినట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన తాజా నివేదికలో ఆ పార్టీ పేర్కొంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) పార్టీకి రూ. 15.1 కోట్ల విరాళాలు అందాయి. ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా పార్టీకి నిధుల ప్రవాహం పెరగడం గమనార్హం.సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తల నుంచి భారీగా విరాళాలు అందుతాయనేది రాజకీయాల్లో సహజంగా వినిపించే మాట. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు విరాళాలు పెరగడం ఈ వాదనకు భిన్నంగా ఉంది. ఇది పార్టీ ఆర్థికంగా ఇంకా బలంగానే ఉందని సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.రాష్ట్రంలో 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్, తిరిగి గద్దెనెక్కాలని బీఆర్ఎస్, తొలిసారి పాగా వేయాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి కీలక తరుణంలో బీఆర్ఎస్‌కు నిధులు పెరగడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా మారింది.

## నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా.. కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్

కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు.ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు.గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

## చౌకధరల దుకాణం నూతన కమిటీ

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా :**

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మండలం చౌక ధరల దుకాణం నూతన సంఘం ఏర్పాటు చేయడమైనది. నూతన సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.ఎ. బషీర్, అధ్యక్షులు. జి అనంతయ్య, ఉపాధ్యక్షులు. పి నర్సింలు, కసిని విక్రాంత్, ప్రధాన కార్యదర్శిగా జి వీరన్న, జనరల్ సెక్రటరీలుగా టి సతీష్ కుమార్,నవీన్ రెడ్డి, కోశాధికారిగా హరీష్, కార్యనిర్వాహన అధ్యక్షులు వెన్నెల, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రీనివాస్ , హనుమాన్ నగర్ అజీమ్ లను ఎన్నుకున్నారు.

# చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

-'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం

-రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్

-గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి

-రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం

-అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపు

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల అభివృద్ధి

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.రూ.11,085 కోట్లతో 'పల్లె పండుగ 3.0"పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.ఉదయగిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలుఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యంఅభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి" అని కోరారు.

## యుద్ధం వస్తే క్షిపణుల కొరత రాకుండా.. భారత్ కీలక నిర్ణయం!

యుద్ధ సమయంలో ఆయుధాల కొరత ఏర్పడితే ఎంత అధునాతన క్షిపణులు ఉన్నా ప్రయోజనం ఉండదు. అందుకే భారత్ క్షిపణుల తయారీలో కీలక మార్పు చేస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యంలో ఉన్న ఈ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలను కూడా తీసుకొస్తోంది. ప్రతి క్షిపణి వ్యవస్థకు కనీసం ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు ఉండేలా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రణాళిక వేస్తోంది. దీంతో యుద్ధ సమయంలో ఒకే సంస్థపై ఆధారపడే పరిస్థితి తగ్గనుంది.

**ప్రైవేట్ కంపెనీలకు టెక్నాలజీ**

ఆగస్టులో రక్షణ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సంప్రదాయ క్షిపణి వ్యవస్థలకు సంబంధించిన డీఆర్‌డీఓ టెక్నాలజీలను అర్హత ఉన్న భారతీయ రక్షణ కంపెనీలకు బదిలీ చేసేందుకు అనుమతించింది. ప్రైవేట్ సంస్థలు టెక్నాలజీ బదిలీ కోసం పోటీ పడొచ్చు. అలాగే డెవలప్‌మెంట్-కమ్-ప్రొడక్షన్ పార్ట్‌నర్స్' (డీసీపీపీ)గా గుర్తింపు పొందితే క్షిపణుల తయారీలో ప్రధాన వ్యవస్థల సమీకరణ బాధ్యతలు చేపట్టొచ్చు.

**పోటీతో ధరలు, డెలివరీపై ప్రభావం**

ఇప్పటివరకు డీఆర్‌డీఓ రూపొందించిన క్షిపణులను ప్రధానంగా ఎంపిక చేసిన ప్రభుత్వ రంగ సంస్థలే ఉత్పత్తి చేసేవి. ఇందులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) కీలకంగా ఉంది. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు కూడా అవకాశం ఇవ్వడంతో పోటీ పెరగనుంది. దీని వల్ల ధరల నిర్ణయం, సరఫరా సమయం, ఉత్పత్తి సామర్థ్యంలో మెరుగుదల రావొచ్చని నివేదిక పేర్కొంది.

**యుద్ధ సమయంలో ఉత్పత్తే కీలకం**

దీర్ఘకాలిక యుద్ధంలో క్షిపణులను వేగంగా తయారు చేసి సరఫరా చేయగల సామర్థ్యం కీలకమని నివేదిక తెలిపింది. ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములను ఏర్పాటు చేయడం ద్వారా ఒక సంస్థలో సమస్య వచ్చినా మరో సంస్థ నుంచి తయారీ కొనసాగించే అవకాశం ఉంటుంది. అయితే ప్రైవేట్ రంగం రావడం ప్రభుత్వ రంగాన్ని పక్కన పెట్టడం కాదని నివేదిక స్పష్టం చేసింది. బీడీఎల్‌కు క్షిపణుల తయారీలో అనుభవం, మౌలిక వసతులు, నైపుణ్యం, సరఫరాదారుల నెట్‌వర్క్ ఉన్నాయని పేర్కొంది.

**ఇక పోటీ తప్పనిసరి**

డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన క్షిపణులను తయారు చేసే హక్కు ఇకపై ప్రభుత్వ రంగ సంస్థలకు ఆటోమేటిక్‌గా దక్కదు. దీంతో గతంలో ఉన్న కేటాయింపు విధానానికి బదులుగా పోటీకి అవకాశం ఏర్పడింది. సంక్లిష్టమైన ఆయుధ వ్యవస్థల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు వేర్వేరు భాగాల్లో ప్రత్యేకత సాధించే కొత్త భాగస్వామ్యాలు కూడా ఏర్పడొచ్చని నివేదిక తెలిపింది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా :**

మండల పరిధిలోని ఫసల్‌వాడి గ్రామ శివారులోని జాతీయ రహదారి-161పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చౌటకూర్ మండలం వెంకటకిష్టాపూర్ గ్రామానికి చెందిన ఈర్ల అంజనేయులు కుమారుడు ఈర్ల అభినయ్ (21) గత ఆరు నెలలుగా సంగారెడ్డిలోని ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారు జామున డ్యూక్ మోటార్‌సైకిల్ నెంబర్ టిజి 15 సి 0342 పై విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. ఫసల్‌వాడి శివారులో జాతీయ రహదారి 161పై ఒక కంటైనర్ లారీ నెంబర్ జిజే 03 సి డబ్ల్యు 8383 రోడ్డుపై అడ్డంగా పడివుంది. లారీ డ్రైవర్ వాహనం చుట్టూ ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకపోవడం, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో చీకటిలో అభినయ్‌కు లారీ కనిపించకపోవడంతో అతని మోటార్‌సైకిల్ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అభినయ్‌కు ముఖం, తల ఎడమ చేతికి తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకోగా, అప్పటికే 108 అంబులెన్స్ ద్వారా అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులు అభినయ్ అత్యవసర విభాగంలో స్ట్రెచర్‌పై మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఈర్ల అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలు, కంటైనర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై దర్యాప్తు చేపట్టారు.

## బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి వివాదం.. హైకోర్టు కీలక ఆదేశాలు

అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించారన్న పోలీసుల వాదనకు ఆధారాలు లేవని స్పష్టం చేసింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించింది.ఈ ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకునేలా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని హైకోర్టు సూచించింది. ఆ నివేదికను అసెంబ్లీ స్పీకర్ ముందు ఉంచాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది.పోలీసులు స్పీకర్ ఆదేశాల మేరకే వ్యవహరించి ఉంటే.. వారిపై చర్యలు తీసుకునే అంశం స్పీకర్ పరిధిలోకి వస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది. అసెంబ్లీ వ్యవహారాల్లో స్పీకర్‌కు ఉన్న అధికారాలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించింది.ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తాజాగా సవరించింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించింది.అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా గేటు వద్ద ఈ ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే. పోలీసులు తమతో దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ వ్యవహారం హైకోర్టుకు చేరింది. తాజాగా కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఈ అంశం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## 20వ జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ ఎంపిక పోటీలు

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా :**

20వ జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్ కోసం జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈరోజు డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను ముఖ్య అతిథిగా విచ్చేసిన టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించి, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో సంగారెడ్డి జిల్లా నలుమూలల నుండి దాదాపు 600 మంది బాలురు, బాలికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. 60 మీటర్లు,600 మీటర్లు, లాంగ్ జంప్, షాట్ పుట్, జావెలిన్ త్రో, ట్రయథ్లాన్ మరియు పెంటాథ్లాన్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.డి. సోహైల్ అలీ, కార్యదర్శి ఎం.డి. జావీద్ అలీ ఆధ్వర్యంలో ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జావెద్ అలీ, వి. రవి, కాసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్, జి. శ్రీనివాస్, ప్రమోద్ కుమార్, భాస్కర్, షరీప్, మల్లికార్జున్, విజయ్, జిల్లా కోచ్‌లు, పీఈటీలు, తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

# బోరు వేయాలంటే..

## ఇంకుడు గుంత తప్పనిసరి

## భూగర్భ జలాల పరిరక్షణకు కఠిన నిబంధనలు అమలు చేయాలి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 29, తెలంగాణ మంజీరా :**

నగర పరిధిలో విచ్చలవిడిగా బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కుత్బుల్లాపూర్ తహసీల్దార్ భైరెడ్డి రాజేష్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసిన తర్వాతే బోరు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమంగా బోర్లు ఏర్పాటు చేస్తున్న యజమానులకు రెవెన్యూ, వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించి సంబంధిత బోరు యజమానులకు నోటీసులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కొత్త లేఅవుట్లు, హెచ్ఎండీఏ, డీపీ లేఅవుట్లలో వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఇల్లు, ప్లాట్‌లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసేలా నిబంధనలు అమలు చేయాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించకుండా వృథా చేస్తే భవిష్యత్‌లో నీటి కొరత మరింత తీవ్రతరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూగర్భ జలాల పరిరక్షణ కోసం అక్రమ బోర్లపై నిఘా పెంచడంతో పాటు ఇంకుడు గుంతల ఏర్పాటును తప్పనిసరి చేయాలని రవీందర్ ముదిరాజ్ కోరారు. కార్యక్రమంలో విఐపీ మల్లేష్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కళావతి నగర్ బొందల గడ్డలో

## క్షేత్రస్థాయి పర్యటన

## మౌలిక వసతుల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కూన రాఘవేందర్ గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 29, తెలంగాణ మంజీరా :**

షాపూర్‌నగర్ 291వ డివిజన్‌లోని కళావతి నగర్ బొందల గడ్డ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను తెలుసుకునేందుకు కూన రాఘవేందర్ గౌడ్, ముద్దాపురం మదన్ గౌడ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. సర్జన్, ఐఏఎస్, కమిషనర్ పింకేష్ కుమార్, ఐఏఎస్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌తో కలిసి ప్రాంతాన్ని సందర్శించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, ఇతర పౌర సేవలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే తమ లక్ష్యమని కూన రాఘవేంద్ర గౌడ్ తెలిపారు. ప్రజల కోసం, ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# ఎన్‌టీఆర్ నగర్‌లో రూ.27 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

## మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది

## కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 29, తెలంగాణ మంజీరా :**

రోడమేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ (దర్బార్ మైసమ్మ బస్తీ)లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.27 లక్షల నిధులు మంజూరు కాగా, సోమవారం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి తగిన స్థాయిలో నిధులు కేటాయించలేదని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.27 లక్షలు మంజూరు చేయడంపై బస్తీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలగడంతో పాటు స్థానికంగా ఎదురవుతున్న రహదారి సమస్యలు పరిష్కారం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ అధినేత, మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్ గౌడ్, స్థానిక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమస్తా మధుసూదన్, బస్తీ వాసులు సత్యనారాయణ, ప్రసాద్, రమేష్, వేణు, శ్రీను, అలీతో పాటు కాంగ్రెస్ నాయకులు కాజా, బలరాం, రాజిరెడ్డి, రఘురెడ్డి, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

# 22ఏపై విజయం ముమ్మాటికీ బీఆర్ఎస్‌దే

## బాధితుల పక్షాన పోరాడింది మా పార్టీనే: బీఆర్ఎస్ నాయకులు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 29, తెలంగాణ మంజీరా :**

మహాదేవపురం, మల్లారెడ్డి నగర్, చెన్నకేశవ నగర్ కాలనీల్లోని ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని, దీనికి సంబంధించిన జీవో కూడా ఉందని 125వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ అంశంపై మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడే హక్కు లేదని వారు విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలు, ప్లాట్లు మరియు ఇళ్ల యజమానులకు అండగా నిలిచిందన్నారు. 2016లో అధికారులు కూల్చివేతలకు వచ్చిన సమయంలో వాటిని అడ్డుకుని బాధితులకు అండగా నిలిచింది ఎమ్మెల్యే కేపీ వివేకానందేనని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా బాధితులతో సమావేశాలు నిర్వహించి, వారి తరఫున పోరాటం చేసిందన్నారు. బీఆర్ఎస్ శాసనసభ ఉపపక్ష నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నాయకత్వంలో కుత్బుల్లాపూర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి 22ఏ బాధితులకు అండగా నిలిచామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అసెంబ్లీ వేదికగా ప్రశ్నించిన వారిలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద కూడా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ నాయకులు చేసిన పోరాటం కారణంగానే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. 22ఏ అంశంలో చోటుచేసుకున్న పరిణామాలు బీఆర్ఎస్ పోరాటానికి ఫలితమేనని, అందువల్ల ఈ అంశంపై సాధించిన విజయం ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీ విజయమేనని స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్ ప్రజలు గత ఎన్నికల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానందకు భారీ మెజార్టీతో మద్దతు ఇచ్చారని, ఆయన అభివృద్ధి కార్యక్రమాలే అందుకు కారణమని నాయకులు పేర్కొన్నారు. కూన శ్రీశైలం గౌడ్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తూ, రాజకీయంగా ప్రజల మద్దతు కోల్పోయారని ఆరోపించారు. కొబ్బరికాయలు కొట్టడం ద్వారా నాయకత్వం రాదని, ప్రజల కోసం చేసిన పనులు, పోరాటాలే నాయకుడి స్థాయిని నిర్ణయిస్తాయని అన్నారు. 125వ డివిజన్ గాజులరామారం బీఆర్ఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# మినరల్ వాటర్ ప్లాంట్ల వ్యర్థ జలాలపై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 29, తెలంగాణ మంజీరా :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి శుద్ధి ప్రక్రియ అనంతరం వెలువడుతున్న వ్యర్థ జలాలను వృథాగా డ్రైనేజీల్లోకి వదులుతున్నారని సామాజిక, పర్యావరణ కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వాటర్ ప్లాంట్ల నుంచి వెలువడే వ్యర్థ జలాలను డ్రైనేజీల్లోకి వదలకుండా, ఆయా ప్లాంట్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాల పరిరక్షణకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు భూగర్భ జలాలను సంరక్షించే విధంగా మినరల్ వాటర్ ప్లాంట్ల యజమానులకు స్పష్టమైన, కఠినమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై సంబంధిత అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని రవీందర్ ముదిరాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో విఐపి మల్లేష్, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు కళ్యాణ లక్ష్మీ పథకం అండ

# కూన శ్రీనివాస్ గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 29, తెలంగాణ మంజీరా :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని పి.పి. నగర్‌కు చెందిన సుజాత కుమార్తె సంధ్యారాణికి ఇటీవల వివాహం జరిగిన సందర్భంగా మంజూరైన కళ్యాణ లక్ష్మీ చెక్కును కేకేఎం ట్రస్ట్ అధినేత, మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మీ ఆర్థిక సహాయం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో తోడ్పాటుగా నిలుస్తోందన్నారు. ముఖ్యంగా ఆడపిల్లల వివాహ సమయంలో ఈ ఆర్థిక సహాయం కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు.

# ఘనంగా ప్రపంచ చెవిటితన దినోత్సవం

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా :**

ప్రపంచ చెవిటితన దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన కార్యక్రమం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ చెవిటితన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య హాజరై దివ్యాంగుల హక్కులు, వారికి అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, ఉచిత న్యాయ సహాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగులు, ముఖ్యంగా వినికిడి లోపం ఉన్న పిల్లలు తమ హక్కులను తెలుసుకొని, అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఆర్.ఎం.ఓ. రవి కుమార్, ఈఎన్‌టీ విభాగాధిపతి, ఇతర వైద్యులు, సిబ్బంది, వినికిడి లోపం ఉన్న చిన్నారులు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కులు, వారికి అందుబాటులో ఉన్న న్యాయ, వైద్య, సంక్షేమ సేవలపై అవగాహన కల్పించారు.

# యాదయ్య కు సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 29, తెలంగాణ మంజీరా :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం డి. పోచంపల్లి వాస్తవ్యులు కోల యాదయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కును మంగళవారం అందజేశారు. మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి కలిసి చెక్కును యాదయ్యకు అందించారు. ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



# మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం

## బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 29, తెలంగాణ మంజీరా :**

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని విజయ దుర్గా కాలనీలో సుమారు రూ.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో గత 12 ఏళ్లుగా కోట్లాది రూపాయల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీల్లో ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ దుర్గా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రమణారెడ్డి, ఉపాధ్యక్షులు శ్యాంసింగ్, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, సభ్యులు రాకేష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, సుమన్, వైఎస్, సందీప్, విశ్వనాథరెడ్డి, వినోద్, శివ నాగరాజు, యుగంధర్, దుర్గాప్రసాద్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యులు అభిషేక్ రెడ్డి, సలీం, చంద్రగిరి సతీష్, నాయకులు సాంబశివరెడ్డి, శ్రీకర్ గుప్తా, మధుసూదన్ రెడ్డి, స్వామి, దశరథ, ముత్యాలు, చంద్రయ్య, స్టాలిన్ రెడ్డి, మహిళా నాయకురాలు లతా రెడ్డి, కృష్ణ మంజరి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి పట్టణం లో నిర్మల జగ్గారెడ్డి పర్యటన

## -అంబేద్కర్ స్టేడియం లో నేషనల్ లెవల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్ ఎంపిక ప్రక్రియ లో

## పాల్గొన్న క్రీడాకారులకు బహుమతులు అందజేత

## -ప్రైడ్ ఆసుపత్రిలో మెకానికల్ సీపీఆర్ పరికరాన్ని ఆవిష్కరించిన నిర్మలా జగ్గారెడ్డి

మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి మంగళవారం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన నేషనల్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు.జాతీయ స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ మీట్‌కు సంగారెడ్డి జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఆమె పరిశీలించారు. నవంబర్ 14, 16 తేదీల్లో జిల్లాలోని వోక్సెన్‌లో జరగనున్న పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోహైల్ అలీ, కార్యదర్శి జావిద్ అలీ, రవి, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.ప్రైడ్ హాస్పిటల్‌లో ఆధునిక వైద్య పరికరాల ప్రారంభంఅనంతరం సంగారెడ్డి పట్టణంలోని ప్రైడ్ హాస్పిటల్‌లో నూతన వైద్య పరికరాలను నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఉపయోగపడే మెకానికల్ సీపీఆర్ (బ్రూ=) పరికరాన్ని ఆమె ప్రారంభించారు. అలాగే గుండెలోని రక్తనాళాల్లో వాల్వ్ బ్లాకేజీ పరిమాణాన్ని గుర్తించేందుకు ఉపయోగపడే ఆధునిక వైద్య పరికరాన్ని కూడా ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆధునిక వైద్య సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వేగంగా, మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్ మాథ్యూస్, డాక్టర్ అనిల్,నాయకులు ప్రవీణ్, కూన వేణు తదితరులు పాల్గొన్నారు.

# గిరినగర్‌లో ఆరు నెలలుగా మూలనపడ్డ బోర్ మోటార్

## తక్షణమే మరమ్మతులు చేసి బిగించాలి

## సీపీఐ నేతల వినతి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 29, తెలంగాణ మంజీరా :**

గిరినగర్ డివిజన్‌లోని గిరినగర్ ప్రాంతంలో పోచమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న సబ్‌మెర్సిబుల్ బోర్‌వెల్ మోటార్‌ను జలమండలి అధికారులు మరమ్మతుల కోసం తీసుకెళ్లి ఆరు నెలలు గడిచినా తిరిగి బిగించలేదని సీపీఐ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మోటార్‌కు మరమ్మతులు పూర్తి చేసి బిగించి స్థానికుల నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మాజీ కౌన్సిలర్ పి. నర్సయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వంగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు, స్థానిక బస్తీవాసులు కలిసి ఐడీపీఎల్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారికి వినతిపత్రం అందజేశారు. మోటార్‌ను తీసుకెళ్లి నెలలు గడుస్తున్నా మరమ్మతులు పూర్తి చేయకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి మోటార్‌ను మరమ్మతులు చేసి బిగించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో గిరినగర్ శాఖ కార్యదర్శి మహమ్మద్ యాకూబ్, సీనియర్ నాయకులు డి. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, తెలంగాణ మంజీరా :**

ఖేడ్ అభివృద్ధి కోసం రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అజారోద్దిన్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కలిసి వివరించారు. నియోజకవర్గంలో మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి పనులపై మంత్రితో ఎమ్మెల్యే విస్తృతంగా చర్చించారు. గతంలో చేసిన విజ్ఞప్తి మేరకు నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో మైనార్టీల సౌకర్యార్థం నూతనంగా నిర్మించనున్న 'షాదీఖానా' భవనానికి రూ. 50 లక్షల నిధులు, అలాగే మున్సిపాలిటీ పరిధిలోని మైనార్టీ సోదరీమణుల స్వయం ఉపాధి కొరకు 200 కుట్టు మిషన్లను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద మైనార్టీ మహిళలు, యువతులకు స్వయం ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అదనంగా మరో 500 కుట్టు మిషన్లను మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఈ విజ్ఞప్తిపై మంత్రి అజారుద్దీన్ అత్యంత సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే నియోజకవర్గానికి అదనపు కుట్టు మిషన్ల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మైనార్టీల సంక్షేమం, అభ్యున్నతికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

# ఆధునిక గుండె వైద్య సేవలకు శ్రీకారం

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా :**

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా జిల్లాలోనే తొలిసారిగా అధునాతన మెషిన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ తూర్పు నిర్మల జగ్గారెడ్డి హాజరై మెషిన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ జిల్లాలోనే తొలిసారిగా సాంకేతికత అందుబాటులోకి రావడం ద్వారా గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో మరింత ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. గుండె రక్తనాళాల్లోని సమస్యలను మరింత స్పష్టంగా గుర్తించేందుక సాంకేతికత ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. సాంకేతికత ఏమిటి? అనేది ఇంట్రావాస్కులర్ అల్ట్రాసౌండ్ సాంకేతికత. ఇందులో ప్రత్యేకమైన కాథెటర్ ద్వారా రక్తనాళాల లోపలికి వెళ్లి, నాళాల గోడలు, ప్లాక్ నిల్వలు, స్టెంట్ స్థానం వంటి వివరాలను అత్యంత స్పష్టంగా చూపిస్తుంది. సాధారణ యాంజియోగ్రఫీ కంటే ఇది మరింత ఖచ్చితమైన సమాచారం అందిస్తుంది. దీని వల్ల వైద్యులు మెరుగైన నిర్ణయాలు తీసుకోవచ్చు. చికిత్స ఫలితాలు మెరుగుపడతాయి. జిల్లాలో ఇలాంటి ఆధునిక పరికరం రావడం వల్ల రోగులు హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని ఆసుపత్రి అధికారులు అభిప్రాయపడ్డారు. గుండె జబ్బులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ సేవ జిల్లా ప్రజలకు గొప్ప ఊరట కలిగిస్తుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూన వేణుతో పాటు పలువురు ప్రముఖులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ అనిల్ కుమార్, అభిలాష్, నిహార్ బాబు, నరేష్ తదితరులు హాజరయ్యారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం జిల్లా ఆరోగ్య రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అందరూ అభిప్రాయపడ్డారు.

# జహీరాబాద్ లో ఉద్రిక్తత

## -పోలీసుల దెబ్బకు బీఆర్ఎస్ కార్యకర్త ప్రాణాలు తీసుకున్నారు

## - పోలీసుల వేధింపులు తాళలేకే శేఖర్ ఆత్మహత్య

## - బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు

**జహీరాబాద్, తెలంగాణ మంజీరా :**

శేఖర్ మృతితో బిలాల్‌పూర్‌లో విషాదఛాయలు చోటుచేసుకున్నాయి. శేఖర్ మృతికి పోలీసుల వేధింపులే కారణమంటూ బంధువుల ఆరోపించారు. న్యాయం చేయాలంటూ జహీరాబాద్ జాతీయ రహదారిపై బంధువుల బైఠాయింపు చేస్తూ, ఆందోళనకు మద్దతుగా జాతీయ రహదారిపై బైఠాయించిన ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతిపై సమగ్ర విచారణ జరపాలని, పోలీసులపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని, బంధువులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. జహీరాబాద్ జాతీయ రహదారిపై ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అనంతరం పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. మృతుని కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికార మదంతో బిఆర్ఎస్ పార్టీ నాయకులను పోలీసులను అడ్డం పెట్టుకుని భయందోళనకు గురి చేస్తున్నారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, పోలీసులు అతిగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పిస్తాం

## అభివృద్ధి, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

## ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, తెలంగాణ మంజీరా :**

డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రానున్న బతుకమ్మ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన సమావేశం లో జిహెచ్ఎంసి డాక్టర్ జ్యోతి, డిఇ.కృష్ణవేణి, ఎఇ.లావణ్యలు పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో కొనసాగుతున్న మౌలిక సదుపాయాల పనుల పురోగతి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, డ్రైనేజీ వ్యవస్థ,వీధి దీపాలు, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బతుకమ్మ వేడుకలు నిర్వహించే ఘాట్ల వద్ద అవసరమైన లైటింగ్ ఏర్పాటు, పారిశుద్ధ్య పనులు, పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన చేపట్టాలని మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగులో నాణ్యమైన మొక్కల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలి

## - నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా :**

జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంతో పాటు రైతులకు నాణ్యమైన మొక్కలు అందించేందుకు నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగులో నాణ్యమైన మొక్కలు, శాస్త్రీయ పద్ధతుల్లో పెంపకం, సరైన నీటి యాజమాన్యం కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు ఆయిల్ పామ్ మొక్కకు రూ.193 చొప్పున రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఝరాసంగం మండలం పోటిపల్లి గ్రామంలో గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయిల్ పామ్ నర్సరీని జిల్లా కలెక్టర్ సందర్శించారు. నర్సరీలో మొక్కల పెంపకం, నిర్వహణ, నీటి యాజమాన్యం, మొక్కల నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీలలో మొక్కల పెంపకానికి నిర్దేశించిన ప్రమాణాలు, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, మొక్కల ఆరోగ్యం తదితర అంశాలను ఉద్యాన శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్

సూచించారు. రైతులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన మొక్కలు మాత్రమే అందేలా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు అధికారులు నర్సరీ వివరాలను కలెక్టర్‌కు తెలియజేసారు. 60 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ నర్సరీలో సుమారు 3 లక్షల ఆయిల్ పామ్ మొక్కల ఉత్పత్తి సామర్థ్యం ఉందని తెలిపారు. నర్సరీ ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా రూ.35,36,154 సబ్సిడీ అందించినట్లు వివరించారు. ఆయిల్ పామ్‌లో ప్రైమరీ, సెకండరీ నర్సరీల నిర్వహణ ఎంతో కీలకమని, ప్రైమరీ నర్సరీలో మొక్కలను సుమారు 90 రోజుల పాటు పెంచి అనంతరం సెకండరీ నర్సరీకి తరలిస్తారని, ప్రస్తుతం ప్రైమరీ నర్సరీలో సుమారు 1.47 లక్షల మొక్కలు ఉన్నట్లు వివరించారు. సెకండరీ నర్సరీలో రైతులకు పంపిణీ చేసే వరకు సుమారు 9 నెలల పాటు మొక్కలను పెంచుతారని, ప్రస్తుతం అక్కడ 2.70 లక్షల మొక్కలు ఉన్నట్లు తెలిపారు. రైతులకు పంపిణీ చేసే సమయంలో ఆయిల్ పామ్ మొక్కలు 10--12 నెలల వయస్సు, సుమారు 1--1.2 మీటర్ల ఎత్తు, 20--25 సెం.మీ. కాండం చుట్టుకొలత (గిర్త్), 10--12 ఆరోగ్యకరమైన ఆకులు కలిగి ఉండేలా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి. సోమేశ్వర్ రావు, ఉద్యాన అధికారులు పండారి, కె. సునీత , అదనపు వ్యవసాయ అధికారి వైద్యనాథ్, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, శైలజ, కేవీకే శాస్త్రవేత్త, గోద్రెజ్ అగ్రోవేట్ నర్సరీ మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఏజీఎం ఈశ్వర్ రెడ్డి, హెచ్ఈఓ సతీష్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.